## క్లుప్తంగా...

### బీఆర్‌ఎస్ మేడ్చల్ రూరల్ అధ్యక్షుడిగా నీరజ్‌గౌడ్

శామీర్‌పేట్: బీఆర్‌ఎస్ మేడ్చల్ రూరల్ అధ్యక్షుడిగా నీరజ్‌గౌడ్ నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం బీఆర్‌ఎస్ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు శంభీపూర్ రాజు అధికారికంగా ప్రకటన చేశారు. ఈ సందర్భంగా నీరజ్‌గౌడ్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు చేరేలా అవగాహన కల్పిస్తానని, పార్టీ మరింత బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు.

### జిల్లా యూత్ ఉపాధ్యక్షుడిగా రామకృష్ణ



మేడ్చల్‌రూరల్: మేడ్చల్ రూరల్ జిల్లా బీఆర్‌ఎస్ యూత్ ఉపాధ్యక్షుడిగా ఎల్లంపేట్ గ్రామానికి చెందిన కోరుపత్తి రామకృష్ణ ఎన్నికయ్యారు. శుక్రవారం బీఆర్‌ఎస్ పార్టీ సమావేశంలో మంత్రి మల్లారెడ్డి, జిల్లా పార్టీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు రామకృష్ణను నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకంతో పదవికి ఇచ్చినందుకు కష్టపడి పని చేస్తానని తెలిపారు.

### పాలిటెక్నిక్ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

మేడ్చల్‌రూరల్: మేడ్చల్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లకు నోటిఫికేషన్ విడుదల చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ స్నేహలత తెలిపారు. కళాశాలలో వివిధ కోర్సులలో మిగిలిన సీట్ల కోసం ఈ నెల 28న స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నామని ఆసక్తి గల విద్యార్థుల దరఖాస్తులను ఈ నెల 25 నుంచి 27వ తేదీల్లో స్వీకరించి 28న కౌన్సిలింగ్ నిర్వహించనున్నట్లు వివరించారు. ఆసక్తి గల విద్యార్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో కళాశాలలో సంప్రదించాలని కోరారు.

### నేడు నారపల్లిలో బొడ్రాయి ప్రతిష్ఠ

పోచారం: నారపల్లిలో శనివారం బొడ్రాయి ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం అవుషాపూర్ నుంచి బొడ్రాయిని నారపల్లి తీసుకొచ్చారు. మెక్‌డోనాల్డ్ నుంచి పెద్ద చెరువు వరకు బొడ్రాయిని ఊరేగింపుగా తీసుకెళ్లారు. బొడ్రాయి ప్రతిష్ఠాపన అనంతరం బోనాలు సమర్పించనున్నారు.

### చీర్యాలలో నవీన్ మిట్టల్ పూజలు



కీసర: చీర్యాలలోని శ్రీలక్ష్మీనర్సింహస్వామిని తెలంగాణ రాష్ట్ర ల్యాండ్ రెవెన్యూ రిజిస్ట్రేషన్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్ మిట్టల్ శుక్రవారం దర్శించుకున్నారు. ఈయనను ఆలయ స్థాపక చైర్మన్ మల్లారపు లక్ష్మీనారాయణ వేద పండితులతో కలిసి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. స్వామివారి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలతో ఘనంగా ఆశీర్వచనం అందజేశారు.

### ఘట్‌కేసర్ మున్సిపాలిటీ కమిషనర్‌కు సన్మానం



నూతన కమిషనర్‌ను సత్కరిస్తున్న చైర్‌పర్సన్ పావనీయాదవ్, కౌన్సిలర్లు

ఘట్‌కేసర్: ఘట్‌కేసర్ మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యత స్వీకరించిన సాబేర్ అలీని మున్సిపల్ చైర్ పర్సన్ పావనీయాదవ్ ఆధ్వర్యంలో వైస్ చైర్మన్ మాధవరెడ్డి, కౌన్సిలర్లు శుక్రవారం సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలని కోరారు. కౌన్సిలర్లు వెంకట్‌రెడ్డి, రమాదేవి, సంగీత, ఆంజనేయులుగౌడ్, అనురాధ, శశికళ, మల్లేష్, పద్మారావు, జహంగీర్, నరేశ్‌యాదవ్, నర్సింగ్‌రావు, రవీందర్, కోఆప్షన్ సభ్యులు షౌకత్, మాజీ ఎంపీటీసీ గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

### కీసరలో ఇంటింటికీ కాంగ్రెస్

కీసర: మేడ్చల్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో శుక్రవారం ఇంటింటికీ కాంగ్రెస్ కార్యక్రమాన్ని కీసరలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా యువజన కాంగ్రెస్ ఇన్‌చార్జిలు సింధుజ, రుక్వర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు. కాంగ్రెస్ నాయకులు రామారావు, శ్రీనివాస్‌రెడ్డి, ఏనుగు సంజీవ్‌రెడ్డి, సుమేష్, ఎం.శ్రీనివాస్, రామకృష్ణారెడ్డి, దుర్గాప్రసాద్, జగపతిరావు, మహిళా కాంగ్రెస్ ప్రతినిధులు శోభారాణి, ఈగ శ్వేత, మెరుగు సునీత పాల్గొన్నారు.

# ఎటు చూసినా నీరే..



అలుగులు పోస్తున్న మేడ్చల్ పెద్ద చెరువు



పరిస్థితి పరిశీలిస్తున్న మేడ్చల్ మున్సిపల్ చైర్‌పర్సన్, కమిషనర్

మేడ్చల్‌రూరల్: మూడు రోజులుగా మేడ్చల్ పెద్ద చెరువుకు ఎగువ నుంచి వరద నీరు రావడంతో శుక్రవారం ఉదయం అలుగులు పోసింది. దీంతో మున్సిపల్ చైర్‌పర్సన్, అధికారులు, కౌన్సిలర్లు చెరువును సందర్శించారు. మండలంలోని అన్ని గ్రామాల్లో చెరువులు నిండుకుండలా మారాయి.

**పరిస్థితి పరిశీలించిన మున్సిపల్ చైర్‌పర్సన్, కమిషనర్..**

మేడ్చల్ పట్టణంలోని పలు వార్డుల్లో శుక్రవారం మున్సిపల్ చైర్‌పర్సన్ మర్రి దీపికానర్సింహరెడ్డి, కమిషనర్ రాములు, కౌన్సిలర్ శివకుమార్‌తో కలిసి పరిశీలించారు. మేడ్చల్ రైల్వే బ్రిడ్జి, 7వ వార్డులో పలు ప్రదేశాలను సందర్శించి వరద నీరు నిలవకుండా చర్యలు చేపట్టాలని సిబ్బందికి సూచించారు. పెద్ద చెరువుల అలుగులు పోస్తుండటం, తుమ్మ చెరువు పూర్తిగా నిండటంతో జాగ్రత్త చర్యలు చేపట్టాలని ఆదేశించారు. శిథిల భవనాలను గుర్తించి అందులో ఉన్నవారిని సురక్షిత ప్రదేశాలకు తరలించాలన్నారు. కౌన్సిలర్లు సైతం తమ వార్డుల్లో పరిస్థితులను పరిశీలిస్తున్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలో చైర్‌పర్సన్ లక్ష్మిశ్రీనివాస్‌రెడ్డి, కమిషనర్ రాములు, స్థానిక కౌన్సిలర్లు పరిస్థితిని పరిశీలించారు.

**జవహర్‌నగర్‌లో సహాయక చర్యలు**

జవహర్‌నగర్: నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు జవహర్‌నగర్ కార్పొరేషన్ తడిసిపోయింది.



చెట్టును తొలగింపజేస్తున్న అవుషాపూర్ సర్పంచ్ కావేరిమశ్చేందర్‌రెడ్డి

ఫైరింగ్ కట్ట వద్ద మురుగు కాలువ రోడ్డుపై పారుతుండటంతో మేయర్ మేకల కావ్య వర్షంలో వెళ్లి సహాయక చర్యలు చేపట్టి పరిష్కరించారు. సంతోష్‌నగర్‌లో డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్ పర్యటించారు. కార్పొరేషన్ పరిధిలో అధికారులు, సిబ్బంది అందుబాటులో ఉన్నారని కమిషనర్ రామలింగం తెలిపారు. బీఆర్‌ఎస్ నాయకులు మేకల అయ్యప్ప, మున్సిపల్ సిబ్బంది పాల్గన్నారు.

**రాంపల్లి చౌరస్తాలో తప్పని తిప్పలు**

కీసర: దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధిలోని చెరువులు పూర్తిగా నిండిపోయి వరద రాంపల్లి చౌరస్తా ప్రధాన రహదారిపై పారుతుండటంతో వాహనదారులకు ఇబ్బందులు తప్పలేదు. మున్సిపల్, పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో వాహనదారులకు వరదనీటిలో రాకపోకలు సాఫీగా సాగేవిధంగా చర్యలు చేపట్టారు. ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా సీఐ వెంకటయ్య, మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డి తదితరులు పరిస్థితిని సమీక్షించారు. మండలంలోని వివిధ గ్రామాల్లో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు.

**అవుషాపూర్‌లో కూలిన చెట్టు**

ఘట్‌కేసర్: మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి అవుషాపూర్ గ్రామంలో పోచమ్మ అమ్మవారి ఆలయానికి వెళ్లే దారిలో శుక్రవారం ఓ చెట్టు కూలి రోడ్డుపై అడ్డంగా పడిపోయింది. సర్పంచ్ కావేరిమశ్చేందర్‌రెడ్డి జేసీబీ సాయంతో చెట్టును పక్కకు తప్పించారు.



మేడ్చల్ కిందిబస్తీలో శిథిల భవనాలను పరిశీలిస్తున్న మున్సిపల్ సిబ్బంది, వార్డు నాయకులు సందీప్‌గౌడ్



జవహర్‌నగర్‌లో సహాయక చర్యలో మేయర్ మేకల కావ్య



సంతోష్‌నగర్‌లో వరదనీటిని పర్యవేక్షిస్తున్న డిప్యూటీ మేయర్ శ్రీనివాస్





రాంపల్లి చౌరస్తా వద్ద..

## పురపాలక సంఘాల్లో కంట్రోల్ రూమ్‌లు



సాక్షి, మేడ్చల్ జిల్లా: నాలుగైదు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో రెవెన్యూ, పురపాలక, గ్రామ పంచాయతీ శాఖలతో సహా సంబంధిత అధికారులు ప్రజలకు అందుబాటులో ఉంటూ అన్ని రక్షణ చర్యలు తీసుకోవాలని మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ అమయ్‌కుమార్ ఆదేశించారు. ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. జిల్లా కేంద్రమైన కలెక్టరేట్‌తో సహా 13 పురపాలక సంఘాల్లో ప్రత్యేకంగా కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేశామన్నారు. మరో మూడు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు జాగ్రత్తగా ఉండాలన్నారు.

**ఇబ్బందులు ఉంటే.. ఫోన్ నంబర్లు**

బోడుప్పల్ పురపాలక సంఘంలో ఫోన్ నెంబర్ 040–27215959, జవహర్‌గర్ మున్సిపల్ కార్పొరేషన్‌లో 99639 96908, 8074064746, నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్‌లో 040– 29569700, ఫీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్‌లో 73311 64056, దమ్మాయిగూడ మున్సిపాలిటీలో 96667 03077, దుండిగల్ మున్సిపాలిటీలో 95427 15377, ఘట్‌కేసర్ మున్సిపాలిటీలో 91540 83772, గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలో 96661 82138, కొంపల్లి మున్సిపాలిటీలో 18004257590, మేడ్చల్ మున్సిపాలిటీలో 93920 11506, 86390 50325, నాగారం మున్సిపాలిటీలో 96400 10053, పోచారం మున్సిపాలిటీలో 89857 73105, తూముకుంట మున్సిపాలిటీలో 91542 79697.

## అనురాగ్ యూనివర్సిటీలో ఉడ్ ప్రాసెసింగ్‌పై సదస్సు



ఘట్‌కేసర్: వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీ(ఏయూ)లో డీఎస్టీ, సీడ్, ఎస్టీఐ నిధులతో తెలంగాణ ఎస్సీల కోసం ఉడ్ ప్రాసెసింగ్‌పై శుక్రవారం సదస్సు నిర్వహించారు. ఇందులో మంచిర్యాల్ జిల్లాకు చెందిన 100 మందికిపైగా ఎస్సీ ప్రాజెక్ట్ లబ్ధిదారులు పాల్గొన్నారు. ముఖ్యఅతిథిగా బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య, గౌరవ అతిథులుగా హైదరాబాద్ యుగాంతర్ ఎన్జీఓ సీఈఓ తేజస్విని మాడభూషి, ఏయూ సీఈఓ నీలిమా హాజరయ్యారు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్, టెక్నాలజీ ఆర్థిక సహకారంతో ఎస్సీలకు ఆధునాతన ట్రేడ్‌లతో కలప ప్రాసెసింగ్ సాంకేతిక సామర్థ్యాన్ని పెంపొందించుకోవడంపై వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఇన్వెస్టిగేటర్ డాక్టర్ హరిప్రియ, కో–ప్రిన్సిపల్ సతీశ్‌కుమారన్ పాల్గొన్నారు.

## గత పాలకులు సక్రమంగా పనిచేయలేదు

కౌన్సిలర్ హంసరాణి

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని కండ్లకోయ గ్రామంలో గతంలో సర్పంచ్‌గా పనిచేసిన వారు సరిగ్గా పనిచేయలేదని, అందుకే సమస్యలు తలెత్తడంతో తాము వాటిని సరిచేస్తున్నామని స్థానిక బీజేపీ కౌన్సిలర్ హంసరాణి అన్నారు. తాను బీజేపీ కౌన్సిలర్ కావడంతోనే వివక్ష చూపుతున్నారని ఆరోపించారు. గ్రామ పంచాయతీగా ఉన్నప్పుడు డ్రైనేజీ పైపులు, అరుగులపై రోడ్లు వేయడంతో డ్రైనేజీ సమస్య నెలకొందని, ఇప్పుడు తాము సరిచేస్తున్నామన్నారు. డ్రైనేజీ పనులు మధ్యలో ఉన్నాయని వివరించారు. గ్రామంలో నీటి సమస్య తీర్చేందుకు కొత్త వాటర్ ట్యాంకులు ఏర్పాటు చేయాలని పలుమార్లు చెప్పినా చేపట్టలేదన్నారు. బీఆర్‌ఎస్ నాయకులు చెత్త సేకరణ ప్రైవేటీకరణ చేయడం వల్లే గ్రామం చెత్తమయంగా మారిందని, వీటిపై తాను కౌన్సిల్‌లో చర్చించినా ఫలితం లేదన్నారు. బీజేపీ కౌన్సిలర్ అని వివక్ష చూపుతూ నిధులు ఇస్తున్నామని ఒకరు చెప్పుకోవడం, అదే పార్టీకి చెందిన నాయకులు అభివృద్ధి జరగడం లేదని చెప్పడం ఆశ్చర్యంగా ఉందని, ఇలాంటి పనులతో ప్రజలను అమోమయానికి గురిచేయాలని చూస్తున్నారని అన్నారు.

## బీఆర్‌ఎస్ బూటకపు హామీలు మానుకోవాలి

ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి



ఘట్‌కేసర్‌లో మాట్లాడుతున్న ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి

ఘట్‌కేసర్: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను రాష్ట్ర పథకాలుగా ప్రచారం చేసుకోవడం సిగ్గుచేటని ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఘట్‌కేసర్‌లో శుక్రవారం ఆయన మాట్లాడుతూ రెండు రోజులు క్రితం మంత్రి హరీశ్‌రావు ఆరోగ్యశ్రీని రూ.2 నుంచి రూ.5 లక్షలకు పెంచుతామని అబద్ధాలు పలికారని, ఇలాంటి ప్రచారం మానుకోవాలన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పేదలకు రూ.5 లక్షల వరకు కార్పొరేట్ వైద్యం అందించాలని ఆయుష్మాన్ భారత్ పథకం ప్రవేశపెట్టారని, దేశంలోని 28 రాష్ట్రాల్లో ఈ పథకం అమలు అవుతోందన్నారు. కేంద్రం అమలు చేస్తున్న ఆయుష్మాన్ పథకాన్ని తెలంగాణ ప్రభుత్వం తమ పథకంగా అబద్ధపు ప్రచారం చేస్తూ యావత్ తెలంగాణ ప్రజలను మోసం చేస్తోందన్నారు. బూటకపు హామీలు ఇవ్వడం మానుకోవాలని హితవు పలికారు.

## మూసీనది ప్రవాహాన్ని పరిశీలించిన సీఐ

ఘట్‌కేసర్: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షంతో ప్రమాదాలు జరగకుండా లోతట్టు ప్రాంతాలను సీఐ మహేందర్‌రెడ్డి, డీఐ వెంకటేశ్, ఎస్సై శేఖర్‌తో కలిసి శుక్రవారం పరిశీలించారు. ఎదులాబాద్ శ్రీలక్ష్మీనారాయణ చెరువు, మూసినది పరివాహక ప్రాంతం, చెరువుల్లోకి నీటిమట్టాన్ని వీక్షించారు. సీఐ మహేందర్‌రెడ్డి, డీఐ వెంకటేశ్ మాట్లాడుతూ ఈత కోసం చెరువులు, కుంటల్లోకి దిగొద్దని, చిన్న పిల్లలు, వృద్ధులు బయటకు రావొద్దన్నారు. అత్యవసర సేవలకు పోలీస్ స్టేషన్ నంబర్ ఫోన్: 87126 62705, సీఐ ఫోన్: 87126 62178కు లేదా 100కు డయల్ చేయాలన్నారు.

## వైద్య శిబిరాలకు స్పందన



ఆయుష్ కార్డు ఆవిష్కరిస్తున్న వైద్య బృందం

కీసర: యాద్గార్‌పల్లి గ్రామంలో యునాని, ఆయుర్వేదిక్, హోమియోపతి వైద్య శిబిరాలను శుక్రవారం నిర్వహించారు. రోగులను పరీక్షించి మందులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయుష్ కార్డును వైద్యులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీనియర్ మెడికల్ ఆఫీసర్ డా.ఇష్రత్ అలియా, డా.ఎ.జంగయ్య, డా.అనగ్, బీడీఎల్ ప్రతినిధులు మోహన్, సౌందర్ రాజన్, గోపీ చంద్, లక్ష్మణ్, సుబ్బరాజు, శివకుమార్‌తో పాటు సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## పోచమ్మ ఆలయ స్థలాన్ని కాపాడాలి

ఘట్‌కేసర్: ప్రతాపసింగారంలోని పోచమ్మ ఆలయ స్థలాన్ని కాపాడాలని ఆ గ్రామానికి ముత్తయ్య శుక్రవారం కలెక్టర్, ఆర్డీఓ, డీపీఓ, తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. సర్వే నంబర్ 378లోని స్థలం 50 ఏళ్లుగా అమ్మవారి ఆలయం ఆధీనంలో ఉందని, కొందరు ఆ భూమిని కబ్జా చేయాలని యత్నిస్తున్నారని లేఖలో పేర్కొన్నారు. కబ్జాపై ప్రశ్నించిన వారిని బెదిరిస్తున్నారని, వారిపై విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను కోరాడు.

## చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి



దుర్యోధనరావు (ఫైల్)

శామీర్‌పేట్: తూముకుంటలో మేస్త్రీ పని చేస్తున్న వ్యక్తి చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తూముకుంట చెందిన దుర్యోధనరావు(30) మేస్త్రి. శుక్రవారం ఉదయం తూముకుంటలోని ఓ భవనం రెండో అంతస్తులో పని చేస్తున్నాడు. అతడికి ఫిట్స్ రావడంతో రెండో అంతస్తు నుంచి కింద పడ్డాడు. చెవి, ముక్కు నుంచి తీవ్ర రక్తస్రావం కావడంతో అతడిని చికిత్స నిమిత్తం ఆర్‌వీఎం ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందాడు. భార్య నాగమణి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి



మృతి చెందిన కార్మికుడు దిలీప్

మేడ్చల్‌రూరల్: విద్యుత్ షాక్‌తో కార్మికుడు మృతి చెందిన ఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధి కిష్టాపూర్ గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన దిలీప్(22) ప్రైవేటు ఇంటర్నెట్ కేబుల్ సంస్థలో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. శుక్రవారం కిష్టాపూర్ గ్రామంలోని శ్మశాన వాటిక వద్ద చెక్‌పోస్ట్ –మజీద్‌పూర్ రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఎక్కి ఇంటర్నెట్ లైన్‌కు మరమ్మతులు చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలకు అతడి చెయ్యి తగలడంతో విద్యుత్ షాక్‌తో అక్కడికక్కడే మృతి చెందాడు. మేడ్చల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు.

## అన్ని రంగాల్లో మేడ్చల్ జిల్లా ఫస్ట్



కార్యకర్తల సమావేశంలో మంత్రి మల్లారెడ్డి

సాక్షి, మేడ్చల్ జిల్లా: ప్రభుత్వ పథకాలను అర్హులైన వారికి చేరవేయడంలో తెలంగాణలోనే మేడ్చల్ జిల్లా ప్రథమ స్థానంలో నిలుస్తుందని రాష్ట్ర కార్మిక ఉపాధి కల్పన శాఖ మంత్రి సీహెచ్ మల్లారెడ్డి అన్నారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక జిల్లా పార్టీ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గం పార్టీ కార్యకర్తలు, యువజన నాయకుల సంయుక్త సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. గ్రామాలు, పురపాలక సంఘాల్లో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాల్లో కూడా మేడ్చల్‌కు ఎన్నో అవార్డులు వచ్చినట్లు ఆయన పేర్కొన్నారు.

**బీఆర్‌ఎస్ గెలుపే లక్ష్యం: ప్రభుత్వ విప్ శంభీపూర్ రాజు**

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో రానున్న ఎన్నికల్లో బీఆర్‌ఎస్ గెలుపు లక్ష్యంగా జిల్లా, నియోజకవర్గం, మండలం, గ్రామస్థాయి నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని ప్రభుత్వ విప్, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు శంభీపూర్ రాజు పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక జిల్లా పార్టీ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గం పార్టీ కార్యకర్తలు, యువజన నాయకుల సంయుక్త సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్‌కు యువజన కార్యకర్తలు పట్టుగొమ్మల్లాంటి వారని పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లడం ద్వారా ముచ్చటగా మూడోసారి పార్టీ అత్యధిక మెజార్టీతో గద్దెనెక్కెలా కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు.

**బీఆర్‌ఎస్ యూత్ విభాగం కమిటీ ఎన్నిక**

ఈ సందర్భంగా మేడ్చల్ నియోజకవర్గం బీఆర్‌ఎస్ యూత్ విభాగం కమిటీని పార్టీ జిల్లా అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ శంభీపూర్ రాజు మంత్రి మల్లారెడ్డితో కలిసి ప్రకటించారు. నియోజకవర్గం పరిధిలోని ఐదు మండలాలకు సంబంధించి బీఆర్‌ఎస్ విభాగం యూత్‌ప్రెసిడెంట్‌గా నిరాజ్‌గౌడ్, ఉపాధ్యాక్షులుగా రామకృష్ణ, దుర్గం వినయ్‌రెడ్డిలు, ప్రధాన కార్యదర్శిగా విజయ్ ముదిరాజ్, కార్యదర్శిగా సంతోష్‌రెడ్డిని నియమించారు. కార్యక్రమంలో మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గం బీఆర్‌ఎస్ ఇన్‌చార్జ్ మర్రి రాజశేఖర్‌రెడ్డి, మేడ్చల్ నియోజకవర్గం పార్టీ ఇన్‌చార్జ్ సీహెచ్ మహేందర్‌రెడ్డి, రాష్ట్ర పార్టీ యువనాయకుడు డాక్టర్ సీహెచ్ భద్రారెడ్డి, జిల్లా రైతుబంధు అధ్యక్షుడు నందారెడ్డి, జిల్లా మార్కెట్ కమిటీ చైర్మన్ నక్క భాస్కర్ యాదవ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దర్గ దయాకర్‌రెడ్డి, డీసీఎంఎస్ వైస్ చైర్మన్ మధుకర్‌రెడ్డి, మండలాలు, పురపాలక సంఘాల పార్టీ అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు నాయకులు పాల్గొన్నారు.

## మేడ్చల్‌లో స్మైల్ టీమ్ దాడులు

- ఐదుగురు బాలకార్మికులకు విముక్తి
- యజమానులపై కేసులు నమోదు

మేడ్చల్‌రూరల్: మేడ్చల్ పట్టణంలోని పలు దుకాణాలు, వ్యాపార సంస్థలపై స్మైల్ టీం శుక్రవారం దాడులు నిర్వహించి ఐదుగురు బాలకార్మికులకు విముక్తి కల్పించింది. బాలకార్మికులను పనిలో పెట్టుకున్న యాజమానులపై మేడ్చల్ పోలీసులు కేసులు నమోదు చేశారు. మేడ్చల్ సీఐ నర్సింహారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని మదీనా గ్లాస్, హాట్‌చిప్స్, కిరాణా షాపుల్లో దాడులు నిర్వహించిన స్మైల్ టీమ్ వారి వద్ద పనిచేస్తున్న ఒరిస్సా, చత్తీస్‌ఘడ్, తమిళనాడు రాష్ట్రాలతో పాటు రాష్ట్రంలోని మహబూబ్‌నగర్ ప్రాంతానికి చెందిన మైనర్లు షాహీద్‌ఖాన్, మనోజ్ బారి, సత్వంతిన్ జాంగ్డే, సూర్య, సాయిచరణ్‌కు విముక్తి కల్పించారు. వారిని పనిలో పెట్టుకున్న యజమానులు మదీనా గ్లాస్, రాజశేఖర్, కిరణ్, రవి, శేఖర్‌ను అదుపులోకి తీసుకుని మేడ్చల్ పోలీసులకు అప్పగించారు. ఈమేరకు మేడ్చల్ పోలీసులు వారిపై కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా సీఐ నర్సింహారెడ్డి మాట్లాడుతూ మైనర్లను పనిలో పెట్టుకోవడం చట్టరీత్యా నేరమని, పనిలో చేర్చుకుంటే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

## తుమ్మచెరువు నిండిన ప్రతిసారీ ఇబ్బందే..

వినాయక్‌నగర్ కాలనీవాసులు



సమావేశంలో కాలనీ అసోసియేషన్ సభ్యులు

మేడ్చల్‌రూరల్: మేడ్చల్ పట్టణంలోని తుమ్మచెరువు నిండిన ప్రతిసారీ తమకు ఇబ్బందులు కలుగుతున్నాయని, అధికారులు తమ కాలనీలోకి నీరు రాకుండా శాశ్వత పరిష్కారం చూపాలని వినాయక్‌నగర్ కాలనీవాసులు కోరారు. శుక్రవారం కాలనీవాసులు మీడియా సమావేశంలో మాట్లాడారు. తుమ్మచెరువు నిండితే నీటి మట్టం తగ్గేందుకు కాలువలు, అలుగులు లేకపోవడంతో చెరువు కట్టలు తెగి నీరు కాలనీల్లోకి చేరి కాలనీవాసులకు ఇబ్బందులు కలుగుతున్నాయన్నారు. గతంలో పలుమార్లు కలెక్టర్, తహశీల్దార్, ఇతర శాఖల అధికారులకు విన్నవించినా ఎలాంటి జాగ్రత్త చర్యలు చేపట్టలేదన్నారు. నాలుగు రోజులుగా వర్షాలు కురుస్తుండటంతో చెరువు అలుగులు పోసే స్థితికి చేరిందని వెంటనే అధికారులు స్పందించి రక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. లేదంటే చెరువు కట్టలు తెగి కాలనీవాసులు బిక్కుబిక్కుమంటూ గడపాల్సి వస్తుందన్నారు. సమావేశంలో కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, కార్యదర్శి పాండుగుప్త, సభ్యులు రాంచందర్, సుదర్శన్‌రెడ్డి, రాజేశ్, శైలేందర్, రాజుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.